## క్లుప్తంగా

### గ్రామాల్లో బుడియాల సందడి



విచిత్ర వేషధారణతో సందడి చేస్తున్న గిరిజనులు

**జి.మాడుగుల:** మన్యంలో గిరిజన ఆచారాల ప్రకారం సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో థింసా నృత్యాలు, విచిత్ర వేషధారణతో, బుడియాలు సందడి చేస్తున్నారు. గ్రామాల్లో సోమవారం కనుమ పండుగ ఘనంగా భక్తి శ్రద్ధలతో గిరిజనులు జరుపుకున్నారు. గిరిజన గ్రామాల్లో పేద, ధనిక, కుల, మతాలు వయస్సుతో సంబంధం లేకుండా విచిత్ర వేషధారణతో డప్పు వాయిద్యాల నడుమ ఆట పాటలతో థింసా మహిళలు నృత్యాలు చేసి ప్రతీ ఇంటికి వెళ్లి 'సేర్ బుడియా'అంటూ నగదు, బియ్యం స్వీకరిస్తూ సందడి చేశారు.

### మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



జమున (ఫైల్)

**దుంబ్రిగుడ:** మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ కొర్రా జమున కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్టు భర్త సీతారాం తెలిపారు. ఆమె స్వగ్రామమైన చంపగుడ గ్రామంలో తుది శ్వాస విడిచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మృతిపై వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం



ట్రోఫీతో విజేత టీమ్

**పెదబయలు:** సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని రూడకోట, పోయిపల్లి పంచాయతీల్లో సర్పంచులు కాతారి సురేష్ కుమార్, బొండా చిట్టి ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ఉల్లాసంగా పోటీలు జరిగాయి. అనంతరం పోటీల్లో విజేత జట్లకు షీల్డ్, ట్రోఫీలను అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, పార్టీ కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### భూ, గృహ హక్కుపత్రాలు అందజేయాలి

**అడ్డతీగల:** జాతీయ రహదారి 516–ఇ పరిధిలోని భూమి, ఇతరత్రా కట్టడాలు కోల్పోతున్నవారు తమకు చెందిన హక్కుపత్రాలను రంపచోడవరం సబ్‌కలెక్టర్‌కు బుధ, గురువారాల్లో అందజేయాలని తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 న బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయింత్రం 5 గంటల లోగా అడ్డతీగల మండలంలోని పెద్దిపుట్ట, వేటమామిడి, అడ్డతీగల, భీముడుపాకలు, పాపంపేట, రాజానగరం గ్రామాలకు చెందిన వారు తమ వద్ద ఉన్న ఆయా భూములకు సంబంధించిన దస్తావేజులు,పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్స్, సంబంధిత దస్తావేజులు, కట్టడాలు ఏవైనా ఉంటే వాటి ప్లాన్ ధ్రువీకరణ పత్రం, పన్ను అసెస్మెంట్, పన్ను రశీదులతో స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కాంపిటెంట్ అథారిటీ(భూసేకరణ) సబ్‌కలెక్టర్, రంపచోడవరం సమక్షంలో హాజరై ఆయా వివరాలు అందజేయాలని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 19 న ఉదయం 11 నుంచి సాయింత్రం 5 గంటలలోగా గొండోలు, వీరభద్రపురం, కోనలోవ, గౌరయ్యపేట, కొట్టంపాలెం గ్రామాల సంబంధిత భూ యజమానులు హాజరుకావాలని తెలిపారు.

### ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

**మునగపాక :** మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా అయ్యప్ప ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. భక్తులు తరలివచ్చారు.



# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- కళకళలాడిన గ్రామాలు
- ఘనంగా సంక్రాంతి, కనుమ పండగలు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు



ఎటపాకలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



మాలివలసలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎంపీపీ బాక ఈశ్వరి

**ఎటపాక:** పల్లెలన్నీ సంక్రాంతి సందడితో కళకళలాడాయి. పల్లె తల్లి తన పిల్లల రాకతో మురిసిపోయింది. ఇళ్లన్నీ మామిడితోరణాలు, ప్రత్యేక అలంకరణతో పండగ కళ సంతరించుకుంది. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఇంటి ముందు గొబ్బెమ్మలతో అందమైన రంగు రంగుల ముగ్గులు వేశారు. వేకువ జామునే హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల సందడితో చిన్నారులు కేరింతలు కొట్టారు. గంగిరెద్దులకు చిన్నారులే ఆహారాన్ని తినిపించి సంతోషాన్ని పంచుకున్నారు. ప్రతీ ఇంట పిండి వంటల ఘుమఘుమలు, బంధువుల రాకతో ఆనందం వెల్లివిరిసింది. కొత్త అల్లుళ్ల, కోడళ్ల, బంధుమిత్రులతో ఇళ్లన్నీ సందడిగా ఉన్నాయి. ప్రత్యేక వంటకాలతో విందు భోజనాలు ఆరగించారు. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. భోగ భోగ్యాలతో భోగి పండగ, ఆనందోత్సాహాలతో సంక్రాంతి, కనుమ పండగను వైభవంగా జరుపుకున్నారు.

**ఎటపాక:** గుండాల కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం చికెన్, మటన్ షాపులు కిటకిటలాడాయి.

**గోవులకు ప్రత్యేక పూజలు**

**రాజవొమ్మంగి:** సంక్రాంతి, కనుమ పండుగలను ఊరువాడ ఎంతో వైభవంగా జరుపుకొన్నారు. ఇంటి ముందు రంగవల్లులు అద్దారు. నవకాయ పిండి వంటలు వండారు. పితృ దేవతలకు పూజలు చేశారు. ఇంటికి వచ్చిన బంధువులతో పాటు పిల్లలు పెద్దలు విందు భోజనాలు ఆరగించారు. నూతన వస్త్రాలు ధరించి సరదాగా గడిపారు. కనుమ పండుగ రోజు సోమవారం రైతులకు అండగా, చేదోడు వాదోడోగా నిలిచే తమ పశువులను, ఎడ్లబండ్లు, తాము ఉపయోగించే నాటు బండ్లు, వ్యవసాయ పనిముట్లు శుభ్రపరిచారు. పసుపు కుంకుమలు అద్ది, సాంబ్రాణి పొగ వేసి ఇంటికి తీసుకొని వచ్చారు. పశువులకు ఇష్టమైన పప్పు అన్నం వండి బెల్లంతో కలిపి కడుపునిండా తినిపించారు. ఆరుగాలం రైతులతో పాటు ఎంతో శ్రమపడే జోడెద్దులు, ఇంటినిండా పాడి ఇచ్చే గోవులను ప్రత్యేకంగా పూజించారు.



కొయ్యూరులో ఓ ఇంటి ముందు ముగ్గు

**పెదబయలు:** పండగ సందర్భంగా గ్రామాల్లో బుడియాలు సందడి చేశారు. వివిధ వేషాలతో థింసా నృత్యాలు చేస్తూ చిన్నారులు, యువత సందడి చేశారు. అయితే తక్కువ గ్రామాల్లో మాత్రమే పంచాంగం ప్రకారం పండగలు జరుపుకుంటే ఎక్కువ గ్రామాల్లో గిరిజన గ్రామ పూజర్లు నిర్ణయించిన తేదీల్లో పండగలు నిర్వహించారు. 16 తేదీ నుంచి ఎక్కువ గ్రామాల్లో పండగలు ప్రారంభం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు గ్రామాల్లో రావడంతో సందడి నెలకొంది.

**దుంబ్రిగుడ:** మండలంలోని దుంబ్రిగుడ, సొవ్వా, గుంటసీమ తదితర గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండగలు ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ బాక ఈశ్వరి తన స్వగ్రామైన సొవ్వ పంచాయతీ మాలివలసలో సంక్రాంతి, కనుమ పండగలను కుటుంబీకులతో ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయ దుస్తులు ధరించారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాల నడుమ స్థానికులతో కలిసి థింసా నృత్యం చేశారు. ఆమెతో పాటు నాయకులు సింహాచలం, నర్సింగరావు, సునీల్, మల్లేష్, తిరుపతి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.



ఇంటి ముంగిట ముగ్గు వేస్తున్న మహిళ



తోడ పెద్దుతో చిన్నారులు

**అనంతగిరి/జి.మాడుగుల:** అనంతగిరి, జి.మాడుగుల మండలాల్లోని శివారు గ్రామాల్లోనూ సంక్రాంతి శోభ నెలకొంది. గిరిజన ఆచార సంప్రదాయం నడుమ మూడు రోజుల పండగలను గిరిజనులంతా ఒకచోట చేరి, ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యాలతో గిరిజనులు హోరెత్తించారు.గ్రామాల్లో హరిదాసులు పర్యటించి, ఇంటింటికీ వెళ్లి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని దీవించారు. సంభావన స్వీకరించారు. డూడూ బసవన్నలు సందడి చేశారు. గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## వేగవంతంగా రోడ్డు పనులు

**కొయ్యూరు:** నడింపాలెం నుంచి ఎం.మాకవరం వరకు రోడ్డు పనులను వేగవంతం చేశారు. సుమారు కోటి రూపాయలతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ రహదారి మధ్యలో వంతెన నిర్మాణం పూర్తయింది. ఎం.మాకవరం పెద్ద గ్రామమైనా మెయిన్‌రోడ్డుకు రెండున్నర ఫర్లాంగుల దూరంలో ఉంది. గ్రామానికి ఎప్పుడో వేసిన మెటల్ రోడ్డు ఉంది. దీని స్థానంలో బీటీ రోడ్డును మంజూరు చేశారు. గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న శివాలయం పక్క నుంచి రోడ్డును ఏర్పాటు చేశారు. ఇక వంతెన నిర్మాణం కూడా పూర్తి కావడంతో రోడ్డు పనులను మొదలు పెట్టనున్నారు. వర్షాకాలం వస్తే కాలువ ఉధృతి మూలంగా రాకపోకలకు కొంత వరకు అంతరాయం కలుగుతుంది. ఇప్పుడు వంతెన నిర్మాణంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానికులు చెబుతున్నారు.



ఎం.మాకవరం రోడ్డు

## పేద కుటుంబానికి సాయం



రత్నమాలకు వితరణ అందిస్తున్న దృశ్యం

**కూనవరం:** మండల కేంద్రంలోని నిరుపేదరాలు రత్నమాల కుటుంబానికి కృష్ణార్జున ఫౌండేషన్ సంస్థ చేయూతనిచ్చింది. సంస్థ వ్యవస్థాపకులు కాకునూరి కృష్ణార్జునరావు ఆమెకు బియ్యం, నూనె, కూరగాయలు తదితర నిత్యావసరాలతో పాటు రూ.1000 నగదు అందించారు. ఆయన మాట్లాడుతూ సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వారికి సంస్థ తరఫున సాయమందిస్తున్నామన్నారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారని సంస్థ దృష్టికి తీసుకొస్తే తమ వంతు సాయమందిస్తామన్నారు. శ్రీనివాసరావు, వెంకటరామారావు, రామారావు, శ్రీనివాసరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త తొలగించరూ..

**దుంబ్రిగుడ:** మండలం కేంద్రంలో పారిశుధ్యం కొరవడింది. చాలా ప్రాంతాల్లో రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో దుర్గంధంతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించినా స్థానిక అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. వీధుల్లో రోజులతరబడి చెత్త తొలగించకపోవడంతో పాటు కాలువల్లో పూడికతీత చేపట్టక ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని, దీంతో పాటు దోమలబెడద ఎక్కువగా ఉందని, కంటి మీద కునుకు ఉండడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త తొలగించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



దుంబ్రిగుడలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త

## అమ్మవారి సారె ఊరేగింపు

**రావికమతం:** గంపవానిపాలెంలో శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇక్కడ గౌరీపరమేశ్వరుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి ఒక్కో రకం మిఠాయితో సారె సమర్పించారు. సర్పంచ్ రొంగలి రామకృష్ణ ఆధ్వర్యంలో యువకులు ఈ ఉత్సవానికి సారథ్యం వహించారు.



సారె ఊరేగింపులో కోలాటం

## సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- సీకరిలో పండగ శోభ

**పెదబయలు:** మన పూర్వీకుల గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను మనం మరువకూడదని, వాటిని పరిరక్షించి, భావితరాలకు సంపదగా అందించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. తెలుగు ప్రజల పెద్ద పండగ సంక్రాంతిని అందరూ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాలతో వైభవంగా, ఆనందంగా జరుపుకోవాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెలే చెట్టి పాల్గుణ స్వగ్రామమైన పెదబయలు మండలంలోని సీకరిలో ఆయన భోగి పండగ నుంచి కనుమ వరకు కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. గ్రామ సావడిలో స్థానికులతో కలిసి గిరిజన సాంప్రదాయ థింసా నృత్యం చేశారు. ఇంటింటికీ వెళ్లి బంధు, మిత్రులందరినీ ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులతో కలిసి సరదగా సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు గిరిజన సంప్రదాయంగా స్వాగతం పలికారు. కనుమ పండుగ నాడు వ్యవసాయానికి వెన్నుముఖ అయిన పశువులకు పూజలు చేశారు. పండిన కొత్త ధాన్యంతో తీసిన బియ్యం ఇతర పంటలతో కలిపి వండిన పులగంను, ధాన్యం కుప్పమట్టు ధాన్యాన్ని ఎమ్మెల్యే పాల్గుణ పశువులకు తినిపించారు. అనంతరం పిండి దుంపలు, అరిసెలు పశువుల మెడకు కట్టి వదిలారు. ఉత్సావంగా పండగలో పాల్గొన్నారు. గిరిజన ఆచార సంప్రదాయాలు అంతరించిపోతున్నాయని, మన గిరిజన పండగలను పూర్వీకుల ఆచారం ప్రకారం జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కొంత సమయం గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన పరుగులు తీస్తోందని, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఢంకా మోగిస్తోందని, విజయ కేతనం ఎగురవేయడం తథ్యమన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, సర్పంచ్ గుల్లేలి కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, అరకు మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రమేష్, చెట్టి వికాష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, వైస్ ఎంపీపీ రాజుబాబు, సూరయ్య ,వెంకయ్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వగ్రామం సీకరిలో పశువుకు పులగం తినిపిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

## కిటకిటలాడిన సంత

- నేటి నుంచి పలు గ్రామాల్లో సంక్రాంతి పండగ ప్రారంభం



వారపు సంతకు వచ్చిన జనం

**పెదబయలు:** మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంత జనాలతో కిట కిటలాడింది. గిరిజనుల సంప్రదాయం ప్రకారం మండలంలో ఎక్కువ గ్రామాల్లో నేటి నుంచి సంక్రాంతి పండగ ప్రారంభమవడంతో సంతకు నూతన వస్త్రాలు, ఇతర పండగ సామగ్రి కొనుగోలు, తాము పండించిన పసుపు, పిప్పళ్లు, రాజ్‌మా ఇతర పంటలు అమ్మకానికి తీసుకువచ్చారు. సంత కిటకిటలాడింది. వస్త్ర వ్యాపారం జోరుగా సాగింది. కొత్త కుండలు, వెదురువస్తువులు, అడ్డ పిక్కలను కొనుగోలు చేశారు. గతవారం కంటే ఈ వారం సంత బాగుందని వ్యాపారులు చెప్పారు.

## గ్రామాల్లో ముగ్గుల పోటీలు



జడ్డంగిలో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

**కొయ్యూరు:** సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని రాజేంద్రపాలెంలో సర్పంచ్ పీటా సింహాచలం ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వివిధ రకాల మోడళ్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు.

**రాజవొమ్మంగి:** సంక్రాంతి, కనుమ పండగల నేపథ్యంలో మండలంలోని జడ్డంగి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 25 మంది మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, గ్రామంలోని ప్రముఖులు సింగిరెడ్డి రవి, ఆవాల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పనులు పూర్తయ్యేదెన్నడో?

**రాజవొమ్మంగి:** రాజవొమ్మంగి నుంచి మైదాన ప్రాంతం ఏలేశ్వరం వెళ్లే రహదారికి సంబంధించి కొంత మేర పాడై అధ్వానంగా మారింది. ఇటీవల ఈ రహదారికి చేపట్టిన మరమ్మతు పనులు అర్ధాంతరంగా నిలచిపోవడం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు శాపంగా పరిణమించింది. ఏజెన్సీ ముఖద్వారంగా పేరున్న ఈ రహదారి కొంత మేర రంపచోడవరం నియోజకవర్గంలో, మరి కొంత మేర ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉంది. ఈ రహదారిపై జె.అన్నవరం నుంచి రమణయ్యపేట వరకు 13 కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. వాహనచోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల రహదారి మరమ్మతు పనులు ప్రారంభించారు. అయితే పనులను కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపివేయడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల, కొయ్యూరు తదితర ప్రాంతాలతో పాటు అటు కాకినాడ, రాజమండ్రి వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. పలు మండలాల నుంచి ఈ రహదారి మీదుగా ఏలేశ్వరం పట్టణానికి రోజుకు 30 ఆర్టీసీ బస్‌లు తిరుగుతున్నాయి. ఎంతో కీలకమైన ఈ రహదారి మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, మెరుగుపడకపోవడంపై స్థానికులు, వాహనచోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఏలేశ్వరం సెక్షన్ ఆర్‌అండ్‌బీ అధికారి ఫణి మాట్లాడుతూ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.



రాజవొమ్మంగి - ఏలేశ్వరం రహదారి

## గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

- ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పరుగు పందేలు

**బుచ్చెయ్యపేట:** గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. బంగారుమెట్టలో ఆదివారం జరిగిన అచ్చమ్మ పేరంటాలు, పొట్టిదొరపాలెం రాములోరి తీర్థ మహోత్సవాలకు వేలాది మంది కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగుల రాట్నం తిరుగుతూ ఈలలు వేస్తూ, బూరలు ఎగరేస్తూ, నేతి చెక్కీలు, ఖర్జూరం ఇతర తినిబండారాలు కొనుగోలు చేసి చిన్నారులతోపాటు పెద్దలు ఉత్సహంగా గడిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు వేస్తూ ఆకట్టుకున్నారు. ఎద్దుల పరుగు పందెం, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆటల పోటీలు అలరించాయి. విజేతలకుకి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

**తారువలో ఘనంగా మర్లమాంబ తీర్థ మహోత్సవం**

**దేవరాపల్లి:** తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా బూడి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను సర్పంచ్ గొంప వరహాలమ్మ, మాజీ ఎంపీటీసీ మలిరెడ్డి మహాలక్ష్మీనాయుడు ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



బంగారుమెట్టలో ఎడ్లబళ్ల పరుగు పందెం తిలకిస్తున్న ప్రజలు

**నేడు రైవాడ, ఎస్.జి. నగరంలో తీర్థాలు...**

రైవాడ ఎరకాలమ్మ అమ్మవారు, ఎస్.జి. నగరంలో నారితల్లమ్మ తీర్థ మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.జి.నగరంలో జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు ఉంటాయన్నారు.

**ఘనంగా రాములోరి తీర్థం**

**మాడుగుల రూరల్:** కనుమ పండగ సందర్భంగా సోమవారం వీరనారాయణంలో శ్రీరాములోరి తీర్థం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**మాకవరపాలెం:** గ్రామాల్లో తీర్థమహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో సోమవారం రామన్నపాలెం, పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద తీర్థ మహోత్సవాలు జరిగాయి. ఈ తీర్థాలకు చిన్నా, పెద్దా అధిక సంఖ్యలో హాజరై ఆనందంగా గడిపారు.



హోరా హోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

**నేడు గొండుపాలెంలో దండు ముత్యాలమ్మ తీర్థం**

**కె.కోటపాడు:** గొండుపాలెంలో దండుముత్యాలమ్మ తీర్థ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.